# యూరియాకు కొరత లేదు..

◆ రైతులు ఆందోళన చెందవద్దు ◆ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
◆ నకిలీ విత్తనాలు, యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు.. అధిక రేటుకు విక్రయిస్తే కేసులు నమోదు
◆ ప్రతి యూరియా విక్రయించే పిఏసిఎస్, ప్రైవేట్ ఎరువుల డీలర్ షాపుల వద్ద ప్రభుత్వ అధికారిని నియమించి పర్యవేక్షణ చేసేలా బాధ్యతలు అప్పగించాలి : రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
◆ కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలు,కలెక్టర్‌లు, ఎస్పీలు, వ్యవసాయ అధికారులు,సహకార శాఖ అధికారులతో యూరియా సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు26 ప్రభాతవార్త:** వ్యవసాయ సీజన్ పూర్తి అయ్యే వరకు యూరియా సరఫరాపై జిల్లా కలెక్టర్‌లు,ఎస్పీలు ప్రత్యేక దృష్టి సారించి నిశితంగా పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర. ఎక్సైజ్,పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రావు తెలిపారు. మంగళవారం మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఉమ్మడి జిల్లాకు చెందిన జిల్లా కలెక్టర్‌లు,ఎస్పీలు,జిల్లా వ్యవసాయ అధికారులు, సహకార శాఖ అధికారులతో ఉమ్మడి జిల్లాలో జిల్లాల వారిగా యూరియా లభ్యత,సరఫరా,ఇండెంట్ ఎంత అవసరం సమీక్షించారు. సమావేశంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, దేవరకద్రశాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి, కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి,అచ్చంపేట శాసన సభ్యులు చిక్కుడు వంశీకృష్ణ,నాగర్‌కర్నూల్ శాసన సభ్యులు కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, గద్వాల శాసన సభ్యులుబండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, మహబూబ్‌నగర్ శాసన సభ్యులు యెన్నంశ్రీనివాసరెడ్డి, నారాయణ పేట శాసన సభ్యురాలు చిట్టెం పర్ణికా రెడ్డి,వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డిలు పాల్గొన్నారు.సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్‌లు, ఎస్.పి.లు జిల్లాల వారీగా పంటల సాగు అంచనా, సాగు అయిన పంటల వివరాలు,యూరియా ఇండెంట్,స్టాక్ లభ్యత,సరఫరాపై తీసుకున్న చర్యలు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ యూరియా సరఫరాలో ఎటువంటి అవకతవకలు జరిగినా,దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించిన అటువంటి ఎరువుల డీలర్‌లపై, నకిలీ విత్తనాలు విక్రయించిన ,అధిక రేటు కు విక్రయించిన వారిపై కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌లు ,ఎస్.పి.లను ఆయన ఆదేశించారు. యూరియా పంపిణీ జరగడం లేదని ఆరోపణలు వస్తున్నాయని వాస్తవంగా కేంద్రం నుండి రావాల్సిన 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా ఇప్పటివరకు 5.72 లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా వచ్చిందని ఇంకా సుమారు 3లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందని తెలిపారు. పూర్తిగా యూరియా వస్తే రైతులకు ఎటువంటి ఇబ్బంది రాదని తెలిపారు రైతులు ఇబ్బంది పడకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్రంతో,కేంద్ర మంత్రులతో మాట్లాడి వెంటనే యూరియా రాష్ట్రానికి వచ్చేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. కొన్ని ప్రైవేటు షాపులలో ఎక్కువ రేటుకు యూరియావిక్రయిస్తూ యూరియాతోపాటు గ్రాన్యూల్స్ కొంటేనే ఇస్తామని చెబుతున్నారని అలాంటి షాపులు కానీ సొసైటీలలో కానీ అధిక ధరలకు విక్రయిస్తే వాటిని వెంటనే సీజ్ చేసి తగు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.రైతులలో యూరియా దొరకదేమోఅనే భయాందోళనలు ఉండకుండా వారికి నచ్చ చెప్పాలన్నారు.యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని,ఎప్పటి కప్పుడు రేకుల వారీగా వచ్చిన యూరియా ఇండెంట్ ను అవసరం ఉన్న చోట సమర్ధంగా పంపిణీకికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.ముఖ్యంగా ప్రైవేట్ డీలర్‌ల వద్ద ఉన్న స్టాక్ సక్రమంగా సరఫరా అయ్యేలా ఆయా జిల్లా కలెక్టర్ లు చర్యలు తీసుకోవాలని అన్నారు. యూరియా వ్యవసాయ సీజన్ ముగిసే వరకు ప్రతి ఎరువుల షాప్, పిఏసిఎస్ , ఆగ్రో సేవా కేంద్రాల వద్ద ఒక్కొక్క షాప్ కు ఒక అధికారిని నియమించాలని,వారికి బాధ్యతలు అప్పగించాలని,యూరియా ఇండెంట్ ఎంత వచ్చింది స్టాక్ లభ్యత ఎంత ఉంది,ఎంత సరఫరా చేశారు తదితర విషయాలపై పక్కాగా మానిటర్ చేయాలని అన్నారు.పోలీస్ అధికారులు కూడా వ్యవసాయ అధికారులు,ప్రతి షాప్ వారిగా నియమించిన అధికారులతో సమన్వయం చేసుకోవాలని, యూరియా సరఫరాలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన ఆదేశించారుయూరియా, ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్న ప్రైవేట్‌డీలర్లతో,శాసన సభ్యులతో జిల్లా కలెక్టర్ లు సమావేశం నిర్వహించి వారికి యూరియా సరఫరా పై తగు ఆదేశాలు జారీ చేయాలని అన్నారు.అదే విధంగా జిల్లాలో మండలం నుండి గ్రామానికి కావలసిన యూరియా రైతులకు సరఫరా చేసేలా ప్రయోగాత్మకంగా ఒక మండలం ను తీసుకొని యోచనచేయాలని ఆయన సూచించారు –మిగతా4లో..



మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# అభివృద్ధిలో భాగమై.. అంతా ఏకమై..

● పార్టీలకు అతీతంగా కార్యక్రమాలు
● మహబూబ్‌నగర్, హన్వాడలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
● పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం, ఎంపీ డీకే అరుణ
● స్వాగతిస్తున్న నాయకులు, కార్యకర్తలు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు26, ప్రభాత వార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలో నూతన రాజకీయ అడుగులు పడుతున్నాయి. అంతిమంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి జరగాలనే ఆకాంక్షలతో అంతా ఒక్కటవుతున్నారు. కార్యక్రమాల్లో పాల్గొంటూ ఒక మంచి సందేశాన్ని అందిస్తున్నారు. ఇటీవల జరిగిన చాలా కార్యక్రమాల్లో ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కలిసి పలుఅభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకోవడమే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. కేంద్రం నిధులు అవసరమున్న చోట ఎంపీని సంప్రదిస్తూ మహబూబ్ నగర్ నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. హన్వాడ మండలం లోని అమ్మాపూర్ తాండ, లింగన్న పల్లి గ్రామాలలో ముడా నిధుల ద్వారా పలు అభివృద్ధి పనులకు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా అమ్మాపూర్ తండాలోని ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర రూ.10లక్షలతో నిర్మించనున్న మల్టీ పర్పస్ షెడ్ నిర్మాణపు పనులకు అనంతరం లింగన్న పల్లి గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద రూ.10 లక్షలతోనిర్మించనున్న షెడ్‌నిర్మాణపు మిగులు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందిస్తూ, ఇచ్చిన ప్రతి హామీలను ఒక్కోటిగా అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్ పి వెంకటేష్, –మిగతా4లో..

# విఘ్నాలు తొలగించు వినాయక

◆ నేడు వినాయక చవితి ◆ వాడవాడలా కొలువుదీరనున్న గణనాథులు
◆ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి ◆ అదిరిపోయే సెట్టింగ్‌లతో మండపాలు



గణనాథుల ప్రతిమలను విక్రయిస్తున్న దృశ్యం

**నర్వ, ఆగస్టు26 ప్రభాతవార్త:** వరసిద్ధి వినాయకుడు తొమ్మిది రోజులపాటు పూజలందుకు నేందుకు సిద్ధమయ్యాడు ....బుధవారం వినాయక చవితి పర్వదినాన్ని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించుకునేందుకు భక్తులు ఏర్పాట్లు చేసుకున్నారు. భారీ సెట్టింగ్‌లతో మండపాలను ముస్తాబు చేశారు. నిర్వాహకులు గణనాథుల ప్రతిమలను కొనుగోలు చేసి మండ పాలకు తర లించారు. గణనాథులు, పూజ సామగ్రి కొనుగోళ్లతో మంగళవారం మార్కెట్లో సందడి నెలకొంది. బుధవారం ఉత్స వ కమిటీలు,భక్తుల కోలాహలం మధ్య వినాయకులు కొలువు దీరనున్నారు. భక్తులు వినాయక చవితి పూజ,వ్రతాలను తమ ఇండ్ల వద్ద భక్తిప్రపత్తులతో ఆచరించ నున్నారు. తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్స వాలు జరుపుకునేందుకు ఉత్స వ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి.వినాయక వ్రత కథ..చంద్ర వంశానికి చెందిన ధర్మరాజు సిరి సంపదలను పోగొట్టు కుంటాడు. కుటుంబంతో వనవాసం చేస్తూ నైమిశారణ్యానికి చేరుకుంటాడు. అక్కడ శౌనకాది రుషులకు అనేకపురాణ రహస్యాలను బోధిస్తున్న సూతమహామునిని దర్శించి, తన పూర్వవైభవం కోసం చేయాల్సి న వ్రతాన్ని చెప్పమంటాడు. దానికి సూత మహర్షి వినాయక వ్రతం చేస్తే సకల కష్టాలు తొలగిపోయి,సకలసౌఖ్యాలు కలుగుతాయని చెబుతాడు. కుమార స్వామికి పరమశివుడు ఈ వ్రత మహాత్యాన్ని గురించి చెబుతాడు. విదర్భ యువరాణి దమయంతి ఈవ్రతం చేయడంతో తాను ఇష్టపడిన నలమహారాజును పెళ్లి చేసుకుందని, శ్రీకృష్ణుడు ఈ వ్రతం చేయడంతోశమంతక మణితోపాటు జాంబవతి, సత్యభామలను పొందగలిగాడని వ్రత మహాత్యాన్ని వివరిస్తాడు.

# రైతులకు తప్పని యూరియా తిప్పలు

● దుకాణం బంద్ చేసిన గ్రోమోర్.. షాప్ ఎదుట నిరసన వ్యక్తం చేసిన రైతులు



గ్రోమోర్ దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు



రైతులకు నచ్చ చెప్తున్న పోలీస్ సిబ్బంది

**బిజినపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త:** మండలంలో యూరియా కొరత రోజు రోజుకీ తీవ్రం అవడంతో ఉన్న కొద్దిపాటి స్టాక్ రైతులకు ఇవ్వలేక గ్రోమోర్ దుకాణం యాజమాన్యం బంద్ చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. తెల్లారి లేచింది మొదలు తిండి తిప్పలు మాని ఎరువుల దుకాణాల ముందు బారులు తీరినా బస్తా యూరియా దొరకట్లేదు అని రైతులు దుకాణం ముందు ఆందోళనకు దిగారు. గ్రోమోర్ దుకాణం మూసివేయడంతో షాప్ ముందు రైతులు నిర సన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్న రైతులను శాంతింప చేశారు. గోదాంలో ఉన్న కొద్దిపాటి స్టాక్ పెద్ద సంఖ్యలో వచ్చిన రైతులకు సరిపడాఅందించలేక దుకాణాన్ని మూసివేసినట్లు రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఉదయం దుకాణం తెరిచిన సమయంలో 100బస్తాలుఉందని చెప్పి రైతులు పెద్దసంఖ్యలో రావడంతో 40బస్తాలు మాత్రమే ఉందని చెప్పడంతో దుకాణంముందు రైతులు బైఠాయించారు. సమయానికి యూరియా అందించకపోతే తీవ్ర నష్టాలు తప్పవని గగ్గోలు పెట్టారు. ఓ వైపు పంట అదను దాటి పోతుంటే పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వెలిబుచ్చారు. యూరియా కోసం రైతులు కళ్లు కాయలు కాసేలాఎదురుచూస్తున్నారని,సాగుపనులు జోరుగా నడుస్తున్న తరుణంలో రైతులు రోజులకొద్దీ దుకాణాల ముందు నిరీక్షించాల్సి వస్తుందని తెలిపారు. రేయి పగలు తేడా లేకుండా ఎరువులదుకాణాల ముందు బారులు తీరుతున్నామని పంటలు వేసిన 20 రోజుల్లోపే ఎరువులు చల్లాలని ఆ తర్వాత వేసినప్పటికీ దిగుబడి తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాలతో సతమతమవుతున్న రైతన్నలకు యూరియా కొరత మరింత వేధిస్తోంది అనిరైతులు మండిపడ్డారు.వానతెరిపినిచ్చిన నేపథ్యంలో పంటకు ఎరువు అందిద్దామని అనుకుంటే యూరియా కొరతతో దిక్కుతోచని స్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు ఫెర్టిలైజర్ షాపుల యజమానులు ఇతర పురుగుల మందులకు, యూరియా బస్తాలకు లంకె పెడుతున్నారని రైతులు ఆరోపించారు.యూరియా కొరతను ఆసరాగా చేసుకుని ఇతర మందు లు అంటగడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు రెండు రోజుల్లో రైతులకు సరిపడా యూరియా తెప్పించి పంపిణీ చేస్తామని రైతాంగానికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. చివరికి యూరియా దొరకపోవడంతో రైతులు ఉసురుమంటూ వెళ్లిపోయారు.

# ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలి

◆ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ◆ నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**బిజినేపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికాలను ఆదేశించారు. మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ లబ్ధిదారు బీసం కృష్ణవేణి ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని, అవి ఏఏ దశలో ఉన్నాయో ఇప్పటి వరకు ఎన్ని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరిగాయని, జరిగినంత వరకు లబ్ధిదారుల అకౌంట్‌లలో డబ్బులు జమ అయ్యాయా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కావాల్సి న సిమెంటు, ఇటుక, స్టీల్ కూడా తక్కువ ధరలకు ఇచ్చేలా చూడాలన్నారు. ఇంటి నిర్మాణానికి కావాల్సి న ఇసుక కూడా ప్రభుత్వమే ఇస్తుందని అన్నారు. మేస్త్రీలు కూడా నిర్ణయించిన ధరప్రకారం ఇల్లు కట్టాలని ఇల్లు కట్టుకునే లబ్దిదారులు మేస్త్రీలకు ఎక్కువ ధర డబ్బులు ఇవ్వకూడదని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటించాల్సి న అవసరం ఉందని ఆయన సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకం ద్వారా తగినసాయాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందిరమ్మ ఇల్లు పేదవాడికి ఉపయోగ పడేలా ఒక వంట గది, ఒక టాయిలెట్‌లతో కలిపి 400600 చదరపు అడుగుల్లో నిర్మించాలని సూచించారు.బేస్ మెంట్ పూర్తి అవ్వగానే 1 లక్ష, స్లాబ్ లెవల్ వరకు గోడలు పూర్తి అవ్వగానే 1 లక్ష, స్లాబ్ పూర్తి అవ్వగానే 2 లక్షలు, మొత్తం ఇల్లు పూర్తి అయి గృహ ప్రవేశం చేసే నాటికి 1 లక్ష రూపాయలు మొత్తం 5 లక్షలు నాలుగు విడతలుగా లబ్ధిదారుల అకౌంట్‌లో డబ్బులు పడతాయని తెలిపారు. ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి దశల వారీగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట తహసిల్దార్ మునీరుద్దీన్ ఎంపీడీవో కథలప్ప ఆర్ ఐ బాలరాజు ,పంచాయతీ సెక్రెటరీ మహేష్ నాయక్ , సిబ్బంది శ్రీశైలం, యశ్వంత్ పాల్గొన్నారు.

# వలస సహాయ కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవాలి

◆నారాయణపేట జిల్లా సిక్తా పట్నాయక్



మొబైల్ వ్యాన్‌ను జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్

**నారాయణ పేట, ఆగస్టు26 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో ఏర్పాటు చేసిన వలస సహాయ కేంద్రం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు.అంతర్జాతీయ వలస సంస్థ ఐఓఎమ్, ఆహార వ్యవసాయ సంస్థ ఎఫ్ఏఓ సంయుక్తంగా,మైగ్రేషన్ మల్టీ పార్ట్‌నర్ ట్రస్టు ఫండ్ సహకారంతో,రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్, వాసన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ కేంద్రం ఏర్పాటు చేశారు కోస్గి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని నమూనా ఇందిరమ్మ గృహంలో మోడల్ ఇందిరమ్మ ఇల్లు వలస సహాయ కేంద్రం ఏర్పాటైందని,అలాగే కేంద్రానికి అనుబంధంగా మొబైల్ వ్యాన్‌ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని నిజామాబాద్, నారాయణపేట జిల్లాలలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఈ వలస సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు వాతావరణ మార్పుల వల్ల కలిగే సమస్యలను తట్టుకునేందుకు,వలస కుటుంబాలకు వ్యవసాయ వ్యవసాయేతర జీవనోపాధులను మెరుగు పర్చుకునే శిక్షణలు నైపుణ్యాలు ఇవ్వబడతాయని వివరించారు సురక్షితమైన, క్రమబద్ధమైన వలసల గురించి మార్గదర్శకం, మానసిక శ్రేయస్సు కౌన్సె లింగ్ సేవలు ఈ కేంద్రం ద్వారాఅందించబడతాయని చెప్పారు వలస సహాయ కేంద్రానికి అనుబంధంగా గ్రామాల వరకు సమాచారాన్ని తీసుకెళ్లేందుకు మొబైల్ వ్యాన్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు అలాగే ప్రవాసీ కౌన్సి లింగ్ సెంటర్ కు అనుబంధంగా టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 18005991393 పనిచేస్తుందని తెలిపారు జిల్లాలోని ఎంపిక చేసిన గ్రామాల్లో అవగాహన శిక్షణ కార్యక్రమాలు రెండేళ్ల పాటు కొనసాగుతాయని కలెక్టర్ తెలిపారు. గత ఫిబ్రవరిలో వలసల పరిస్థితిని అధ్యయనం చేసేందుకు జపాన్‌కు చెందిన సంస్థ ప్రతినిధులు నారాయణపేటకు వచ్చిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. నారాయణపేటజిల్లా వలసలేని జిల్లాగా మారేందుకుఇలాంటి ప్రాజెక్టులు మరెన్నో రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, డీఆర్‌డీఏ మొగులప్ప, తహసీల్దార్ బక్క శ్రీనివాస్,ఎంపీడీఓ శ్రీధర్, మున్సి పల్ కమిషనర్ నాగరాజు, ఐఓఎమ్ రాష్ట్ర సమన్వయకర్త జలజ, సహాయ సమన్వయకర్త మార్ష ఆశీర్, సంస్థ ఫీల్డ్ ఫెసిలిటేటర్స్ పాల్గొన్నారు.

# పింఛన్లు పెంచకపోతే రాజీనామా చెయ్

- రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచాలి
- సెప్టెంబర్ 9న ఛలో హైదరాబాద్ పెన్షన్ దారుల మహాగర్జ
- ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ



**జడ్చర్ల, ఆగస్టు26,ప్రభాతవార్త:** వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ.4 వేలకు పెంచాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ, మందకృష్ణ మాదిగ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పెన్షన్ దారుల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల లో నియో జకవర్గ సన్నాహక సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ హాజరై మాట్లాడారు. వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవ్వ కుండా మోసం చేశాడని అన్నారు. ఈ నెల ఓటు వేయండి,వచ్చే నెల నుండే పెన్షన్ తీసుకోండని మాట్లాడిన రేవంత్‌రెడ్డి ఓటు వేశాక ముఖ్యమంత్రి అయి పెన్షన్ దారులందర్నీ ఘోరంగా మోసం చేశాడని విమర్శించాడు. రేవంత్‌రెడ్డి చేసిన మోసం గురించి ప్రతి పక్షాలు కూడా మాట్లాడకుండా చేయూత పెన్షన్ దారులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. 50 లక్షల మంది పెన్షన్ దారుల పక్షాన వికలాంగుల హక్కుల పోరాట సమితి మాదిగ –మిగతా4లో..

# బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

● పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అమ్మాయిలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
● వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

**వనపర్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో బాల్య వివాహాలు జరుగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలిశ్యాం, మ్యామ్ పిల్లల సంఖ్య జీరో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఎన్ఐసి హాలులో జిల్లా సంక్షేమ శాఖ సిడిపిఒలు, సూపర్‌వైజర్‌లు, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశంనిర్వహించారు. జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనపై చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందని ప్రశ్నించారు. వనపర్తి జిల్లాలో గత మూడు నెలల్లో 25మంది బాలికలకు బాల్య వివాహాలు చేసేందుకు ప్రయత్నాలుజరిగాయని వాటిని ముందుగానే తెలుసుకొని నివారించడం జరిగిందని, కొంత మంది పై కేసులు సైతం నమోదు చేయించడం జరిగిందని డిసిపిఓ రాంబాబు సమాధానం ఇచ్చారు. స్పందించిన కలెక్టర్ బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నం చేయడం కూడా నేరమే అని అలాంటి వారిపై –మిగతా4లో..

# ప్రతిపక్ష నాయకుల మాటలను రైతులు నమ్మవద్దు

● సకాలంలో రైతులకు యూరియా సరఫరా
● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త:** రైతులను తప్పుదోవ పట్టించడానికి పని కట్టుకొని ప్రతిపక్ష నాయకులు రైతులను మభ్య పెడుతున్నారని, వారి మాటలను రైతులు నమ్మవద్దని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉమ్మడి పాలమూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన యూరియా సరఫరా మీద నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో ఎక్కడెక్కడ యూరియా సమస్య ఉంది, ఇంకా ఎంత యూరియా అయితే సరిపోతుంది అనే అంశాలను మంత్రి జూపల్లి కృష్ణారావు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు పత్తి, మొక్కజొన్న, కందులు, మినుములు మరియు అధిక మొత్తంలో వరి పంటలు అధికంగా సాగు చేస్తున్నారు అందువల్ల యూరియా అవసరం చాలా ఉన్నది కావున అధిక మొత్తంలో కేటాయించాలని మంత్రిని కోరారు.ఇందుకుగాను మంత్రి స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి రెండు రోజుల్లో అధిక మొత్తంలో యూరియా సరఫరా చేస్తామని, ఏ ఒక్క రైతు కూడా ఇబ్బంది పడవద్దని అనవసరంగా ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలో పడకండి అని మంత్రి సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్ లు, ఎస్పీలు, వ్యవసాయ, పోలీస్, సహకార మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



ఆర్డీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాల టౌన్ ఆగస్టు 26, ప్రభాతవార్త:** భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ భూ భారతికి సంబంధించిన ఫైళ్ళు, రిజిస్టర్లు, ఇతర రికార్డులను సవివరంగా పరిశీలించారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉండాలని సూచించారు. కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సులో ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రెవిన్యూ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అలివేలు, ఏ.ఓ వెంకట్ రావు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

## ముడా నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

**బాలానగర్, ఆగస్టు26 ప్రభాతవార్త:** బాలానగర్ మండల కేంద్రంలో ముడా నిధులతో మంగళవారం నూతన సీసీ రోడ్ల నిర్మాణాన్ని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం బాలానగర్ గ్రామ పంచాయతీకి ఇంతకుముందు ఏ ఎమ్మెల్యే మంజూరు చేయనన్ని నిధులు సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం మంజూరు చేశారు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డికి గ్రామ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా చైర్మన్ తిరుపతి, మాజీ సర్పంచ్ శంకర్, భానూరి బిక్షపతి, ప్రభులింగం, భాస్కర్ గౌడ్, రాజు యాదవ్, గోవర్ధన్ యాదవ్, శివ యాదవ్, భూపేందర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



ఆత్మకూరులో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శశిధర్

**ఆత్మకూర్ ఆగస్టు 26, ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ఆత్మకూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకుని మంగళవారం రోజు మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్ శశిధర్ మాట్లాడుతూ మట్టి వినాయకులు పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఉద్దేశంతో ఉచిత మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. సహజ వనరులనుకలుషితం చేయకుండా భవిష్యతరాలకు వాతావరణ కాలుష్యాన్ని నివారించే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పలు కాలనీలలో ఏర్పాటు చేయనున్న వినాయక మండపాల వద్ద మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రజలు శాంతియుతంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు షూస్, టై బెల్టుల అందజేత

**గద్వాల టౌన్‌ఆగస్టు 26, ప్రభాతవార్త:** యంగ్ టర్క్స్ ఫౌండర్ పి. తరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఆముదాలపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు షూస్, టైలు, బెల్టులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మనోపాడు ఎంఈఓ శివప్రసాద్, ఎంపీడీఓ రాములు, సీడీపీఓ సుజాత, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఈశ్వరయ్యలతో పాటు గ్రామ పెద్దలు రామణా రెడ్డి, యుగేంద్ర రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అందరి సహకారంతో అంగన్వాడి కేంద్రం కొత్త భవనం నిర్మాణానికి 8 లక్షలు మంజూరుఅయ్యాయని తెలిపారు. పాఠశాల, గ్రామాభివృద్ధికి ప్రోత్సాహం అందించిన వారందరికీ తరుణ్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా మదర్ తెరిసా జయంతి



**అమరచింత ఆగస్టు 26, ప్రభాత వార్త:** అమరచింత మున్సిపల్ కేంద్రంలోని నవోదయ స్వచ్ఛంద సేవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం మదర్ తెరిసా 115వ జయంతి వేడుకల సందర్భంగా కొత్త బస్టాండ్‌లో మదర్ తెరిసా విగ్రహానికి నవోదయ స్వచ్ఛంద సేవ సమితి అధ్యక్షులు శ్యాంసుందర్ పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో హెచ్ఐవి, కుష్టువ్యాధి, క్షయ వ్యాధిలతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు మదర్ తెరిసా స్వచ్ఛంద సేవలు ఏర్పాటుచేసి రోగులకు అనేక సేవలందించిన ఘనతమదర్ తెరిసాకు దక్కిందని ఆయన అన్నారు. మదర్ తెరిసా చేసిన సేవలకు 1979 లో నోబెల్ శాంతి, 1980 భారత ప్రభుత్వం భారతరత్న అవార్డు అందుకున్న ఘనత ఆమెకే దక్కిందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు సామాజిక సేవ అలవర్చుకోవాలని అలాగే మదర్ తెరిసాను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ రవికుమార్, ఎస్ లక్ష్మణ్, ఏసన్న, వరణ్, రఘు, ప్రభాకర్, గోపాల్ తదితరులు ఉన్నారు.

## గోడపత్రిక విడుదల

**అమరచింత ఆగస్టు 26, ప్రభాతవార్త:** కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న హైదరాబాదులోని ఇందిరా పార్కు దగ్గర జరిగే మహాధర్నాకు సంబంధించిన గోడపత్రికను మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ ఓ, నరసింహయ్య, పి ఆర్ టి యు అధ్యక్షులు రాజు, హనుమంతు, శ్రీనివాసులు, సిపిఎస్ జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎండి గౌస్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో సిపిఎస్ ను రద్దు చేస్తానని వాగ్దానం చేసిన ఇప్పటివరకు అమలు చేయడం లేదని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఓ పి ఎస్ ను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్‌ను అమలు చేయాలనిడిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న హైదరాబాదులోని ఇందిరా పార్క్ దగ్గర జరిగే మహాధర్నాకు ఉద్యోగులు భారీగా పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, యాదయ్య, చంద్రకళ, వీరితోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

## బిజెపి సోషల్ మీడియా జిల్లా ఇంచార్జిగా వేణుగోపాల్ రెడ్డి

**వడ్డేపల్లి, ఆగస్టు26(ప్రభాతవార్త):** భారతీయ జనతా పార్టీ గద్వాల జిల్లా సోషల్ మీడియా ఇంచార్జిగా వేణుగోపాల్ రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం యువ నాయకులు స్నిగ్ధ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, జాతీయ ఉపాధ్యక్షులు ఎంపీ డీకే అరుణమ్మ, జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు మాజీ అధ్యక్షులు రామచంద్రారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బిజెపి పార్టీ యొక్క కార్యకలాపాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిపార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బండల వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు విద్య, వైద్యం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత

◆ గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యాశాఖను గాలికి వదిలేసింది ◆ దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి

**దేవరకద్ర, ఆగస్టు 26 ప్రభాతవార్త:** ప్రమాణాలతో కూడిన విద్య, పేద కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించడం కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతగా తీసుకుంటుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకద్ర మండలం శ్రీనివాస గార్డెన్స్‌లో ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ మేళాలో పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం, కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండు కళ్ళు లాంటివని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యాశాఖను గాలికి వదిలేసిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దనేఉంచుకుని, విద్యపై అధిక దృష్టిని కేంద్రీకరించి విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి దేవరకద్ర నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేశారని, అంతేకాక అడిగిన వెంబడే పల్లమారి వద్ద ఐటిఐ కాలేజ్‌ను మంజూరు చేశారు. దేవరకద్ర నియోజకవర్గ కేంద్రానికి డిగ్రీ కాలేజ్, చింతకుంట మండల కేంద్రానికి జూనియర్ కాలేజ్ తీసుకొచ్చామన్నారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ చేయలేనిది, 18 నెలల కాలంలో చేసి చూపించామని దేవరకద్ర ఎమ్మెల్యే జిమధుసూదన్‌రెడ్డి అన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం వేటర్నరీ శాఖ ఆధ్వర్యంలో యానిమల్స్‌కు పిపిఆర్ వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎంఈఓ బలరాం, విద్యాశాఖ అధికారులు, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ కృష్ణయ్య, మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, టిపిసిసి ఆర్గనైజేషన్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ ప్రెసిడెంట్ హనుమంత్ రెడ్డి, గద్దె గూడెంపూర్ణిత, గోపాల్, చంద్రమౌళి, కోన రాజశేఖర్, ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీపల్లి చంద్రశేఖర్, లాజర్ , ఎమ్మార్పీ చంద్రశేఖర్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జిఎంఆర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

# భూ నిర్వాసితుల డిమాండ్ ప్రకారమే నష్టపరిహారం

◆ వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి

**ఖిల్లాగణపురం ఆగస్టు 26. ప్రభాతవార్త:** ఘనపసముద్రం రిజర్వాయర్లో భూములు ముంపుకు గురవుతున్న రైతులకు వారి డిమాండ్కు తగ్గట్లుగానే నష్టపరిహారం అందజేస్తున్నామని వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వేసైట్ మార్కెట్ను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గడప సముద్రంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు 12 లక్షల 60 వేల రూపాయలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. రానున్న మూడు సంవత్సరాలలో వనపర్తి నియోజకవర్గంలోని నిరుపేదలందరికీ పక్కా ఇండ్లుమంజూరు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని ఆయన చెప్పారు. రేషన్ కార్డులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందజేశామన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున బరిలో ఉండే ప్రతి వ్యక్తిని మీరు గెలిపించాలని ఇతరులు గెలిపిస్తే అభివృద్ధికి ఆటంకాలుగా మారుతారని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం మండల పరిధిలోని 30 మందికి కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులతో పాటు 23 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు ఎమ్మెల్యే మేఘారెడ్డి అందజేశారుఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్‌రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ వెంకటేశ్వరరావు గంజాయి రమేష్ వెంకటయ్య ఆకారం ప్రకాష్ అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రజా ప్రభుత్వంలో రైతుల కష్టాలు

◆ రైతు శ్రేయస్సును మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం
◆ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి వాల్యా నాయక్

**బాలానగర్, ఆగస్టు 26 ప్రభాతవార్త:** ప్రజా ప్రభుత్వంలో రైతులు కష్టాలు పడుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు శ్రేయస్సును మరిచిందని రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి వాల్యా నాయక్ మండిపడ్డారు. మంగళవారం బాలానగర్ మండల కేంద్రంలో ప్రజా ప్రభుత్వ వైఫల్యాలను చర్చించేందుకు ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్క రైతుకు ఇబ్బందులు కలగలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతును రాజును చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ముందుచూపు లేకపోవడంతో రైతులు యూరియా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సకాలంలో ప్రభుత్వం స్పందించి, త్వరితగతిన రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. యూరియా సరఫరాలో ఆలస్యం జరిగితే రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే ప్రజలందరికీ మేలు జరుగుతుందని, ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6గ్యారంటీలు చూసి ఓటు వేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసగించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూ.లక్ష కోట్ల అవినీతి అవాస్తవమన్నారు. ప్రాజెక్టుకి ఖర్చు పెట్టింది 88 వేల కోట్లు అయితే లక్ష కోట్ల అవినీతి ఎలా జరిగిందో చెప్పాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ పై అనుచిత వ్యాఖ్యలుచేయడం మానేసి, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలలో వ్యతిరేకత వచ్చినందువల్లే స్థానిక ఎలక్షన్లను వాయిదా వేస్తూ వస్తున్నట్లు ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటు వేసి ఇప్పుడు బాధ పడుతున్నారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపడుతుందని, ప్రజలందరూ ధైర్యంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రావు, మాజీ ఎంపీపీ కమల, లక్ష్మణ్ నాయక్, తిరుపతి నాయక్, గోపినాయక్, లక్ష్మయ్య, శివానందరెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి వాల్యా నాయక్

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**అమరచింత ఆగస్టు 26 ప్రభాతవార్త:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ నికిత, హెల్త్ సూపర్వైజర్ సురేందర్ గౌడ్ ప్రజలను కోరారు. మంగళవారం అమరచింత మండలంలోని కొంకనివాని పల్లె గ్రామంలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. అలాగే గ్రామంలో డెంగ్యూ వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వ్యక్తి హాస్పటల్లో చేరడంతో అప్రమత్తమైన వైద్య సిబ్బంది గ్రామంలో రక్త నమూనాలను సేకరించారు. అలాగే గ్రామంలో దోమల నివారణకు స్ప్రే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వర్షాకాలంలో దోమల వల్ల మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ వ్యాధి, మెదుడు వాపు, సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వారు కోరారు. అలాగే ప్లాస్టిక్ డ్రమ్ము, సంపు, మట్టి కుండలో నిలువ నీటిని ఉంచకుండా చల్లాలని, అలాగే చుట్టుపక్కల తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు కోరారు. జ్వరాలు వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎల్ఓ టీం గంధం రాజు, సత్యం, ఏఎన్ఎం శారద, పంచాయతీ కార్యదర్శి, మోహన్, రవి, రాజు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్యాధికారులు

# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలను వాడాలి

**గద్వాల టౌన్ ఆగస్టు 26, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ అన్నారు. మంగళవారం ఐ.డి.ఓ.సి ఆవరణలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి తయారు చేసిన 2000 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాల వినియోగం ఎంతో ముఖ్యమని అన్నారు. సాధారణంగా, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నదులు లేదా చెరువుల్లో వేయడం ద్వారా వాటిలోని రసాయన పదార్థాలు నీటిని కలుషితం చేస్తాయని తెలిపారు. మట్టి విగ్రహాలు సహజంగా కరిగి పోతాయని, వాటి వినియోగం పర్యావరణానికి ఎటువంటి హానీ కలిగించదని వివరించారు. పట్టణాలతో పాటు గ్రామాలలో కూడా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, ఏఓ భూపాల్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిశిత, బిసి సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ విమల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలను అందజేస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెంచాలి

జిల్లా వైద్యాధికారి అల్లె శ్రీనివాస్

**పెబ్బేరు ఆగస్టు 26 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి అల్లె శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, మెడిసిన్ రిజిస్టర్, ఓపి రిజిస్టరును తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాత భవనములను శిథిలావస్థలో ఉన్నందున, వెంటనే కొత్తగా నిర్మాణం చేపడుతున్న భవనము తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు తెలియజేశారు. పది రోజుల్లో పూర్తిచేసి మాకు హ్యాండ్ వర్క్ చేయాలని అన్నారు. గ్రామంలో పట్టణంలో డెంగ్యూ, చికున్ గున్యా, సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన పరచాలని వైద్య సిబ్బందికి తెలియజేశారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డా. చంద్ర శేఖర్, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్, స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్ కృష్ణ, విజయలక్ష్మి, ఫార్మాఆఫీసర్ కుమారి, ల్యాబ్ టెక్నీషియన్ విక్టర్‌రాజు పాల్గొన్నారు.





వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నేతలు

## ప్రజా ప్రభుత్వంలో రైతన్న అవస్థలు

**చిన్న చింతకుంట, ఆగస్టు 26 ప్రభాతవార్త :** ప్రజాప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో యూరియా దొరకక రైతన్న అవస్థలు పడుతున్నారని బిఆర్ఎస్ నేతలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మంగళవారం రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు దేవరకద్ర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల వ్యవసాయ కార్యాలయంలో మండల విస్తరణ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రైతులకు యూరియా సరఫరా చేయలేని దుస్థితిలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ ఉందని నాయకులు ఎద్దేవా చేశారు. మార్పు మార్పు అంటూ ఊక దంపుడు ఉపన్యాసం ఇచ్చి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క రైతుకుడా సంతోషంగా లేని పరిస్థితి వచ్చిం దని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దిక్కుమాలిన ప్రభుత్వం నిర్ణయాల వల్లే రైతన్నలు ఆందోళనకు దిగుతున్నారని మండల భారత రాష్ట్ర సమితి మండల నాయకులు మండిపడ్డారు. రైతులకు సరిపడా యూరియా అందజేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కోట రాములు, సీనియర్ నాయకులు కర్ణాకర్ రెడ్డి, మండల సర్పంచ్‌ల మాజీ అధ్యక్షులు మోహన్ గౌడ్, అజయ్ కుమార్‌రెడ్డి, పల్లమరి మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి, నాయకులు శివ శంకర్ గౌడ్, సాయిలు, ఇబ్రహీం, అనిల్, లక్ష్మణ్, రియాజ్, వివిధ గ్రామాల పార్టీ అధ్యకులు మండల యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖిల్లా రైస్ మిల్లులను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**ఖిల్లాగణపురం, ఆగస్టు 26, ప్రభాతవార్త:** మండలంలోని పలు రైస్ మిల్లులను జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మ్యానాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎంఆర్ డెలివరీ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. పిల్లర్లకు వానాకాలం మరియు రబీ సీజన్లకు సంబంధించిన ధాన్యం నిలువలు మరియు వాటి సరఫరాపై తగు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా లక్ష్మీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్‌ను సందర్శించి అనంతరం శ్రీనివాస ఇండస్ట్రీస్‌ను పరిశీలించారు. మండల కేంద్రంలోని శ్రీరామ ఇండస్ట్రీస్‌కు వెళ్లి ధాన్యం మిల్లింగ్ ప్రక్రియను సీఎంఆర్‌డెలివరీల పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు. రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో మిల్లింగ్ చేసి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సీఎంఆర్ బియ్యమును పౌరసరఫరాల శాఖకు అప్పగించడంలో ఎటువంటి అలసత్వం వహించరాదని రైస్ మిల్లర్లను గట్టిగా హెచ్చరించారు. సీఎంఆర్ డెలివరీలలో ఏమాత్రం జాప్యం జరిగిన ప్రభుత్వం దీనిని తీవ్రంగా పరిగణిస్తుందని సంబంధిత రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందనిహెచ్చరించారు. ఈ తనిఖీలలో జిల్లా పౌరసరాఫరాల అధికారి కాశీ, జిల్లా మేనేజర్ జగన్మోహన్ డిప్యూటీ తాసిల్దార్ పరమేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా పోచమ్మ బోనాలు

**పెబ్బేరు, ఆగస్టు 26 ప్రభాతవార్త :** పెబ్బేర్ పట్టణంతో పాటు పలు గ్రామాలలో మంగళవారం అంగరంగ వైభవంగా పోచమ్మ బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు చిన్నారులు అధిక సంఖ్యలో బోనమెత్తుకొని ఊరేగింపుగా అమ్మవారికి చీరలు, గాజులు, కుంకుమ, పసుపుతో, టెంకాయలు అమ్మవారికి నైవేద్యం సమర్పించుకున్నారు. అనంతరం జట్కా పద్ధతిలో కోళ్లను సమర్పించారు. పెబ్బేరు పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. పోచమ్మ బోనాల పండుగ సందర్భంగా పట్టణంలోని ప్రముఖులు, నాయకులు ప్రతి ఒక్కరు పట్టణ ప్రజలకు పోచమ్మ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

◆ కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాల అభివృద్ధి : ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప

**గండీడ్ ఆగస్టు26, ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప డిమాండ్ చేశారు. మంగళవారం గండీడ్ మండల కేంద్రంలోనీ విశ్వభారతి కాలేజీ నుండి ర్యాలీగా వెళ్లి గండీడ్ గ్రామంలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని నిరసన కార్యక్రమం చేపట్టి తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ యాసీన్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో హరిచంద్ర రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నఈశ్వరప్ప, రాష్ట్ర నాయకులు ఏ.వి.రాములు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఆచరణకు సాధ్యంకానీ ఎన్నో హామీలను ఇచ్చి ప్రజలను మోసగించి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని వారు విమర్శించారు. రైతు రుణమాఫీ పూర్తిగా అమలు చేయలేదని, సన్న వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇవ్వలేదని, మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా 2500, కళ్యాణ్ లక్ష్మి లో తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు తప్ప, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయించడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వంపై నిరంతరంగా పోరాటం చేస్తామనిఅన్నారు. ఉమ్మడి గండీడ్ మండలాన్ని మహబూబ్నగర్ జిల్లా నుండి వికారాబాద్ జిల్లాలో కలపాలని వారు డిమాండ్ చేశారు. జోగులాంబ జోన్లో ఉండడం వల్ల నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని, చార్మినార్ జోన్‌లో కలిపేవరకు ప్రజలతో కలిసి ఉద్యమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో గండీడ్ మండల బిజెపి అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీలు సంజీవరెడ్డి, కొమీరె లక్ష్మయ్య, వికారాబాద్ జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్, మాజీ బీజేపీ అధ్యక్షులు మైపాల్ గౌడ్, ప్రభు నాయక్, ప్రధాన కార్యదర్శులు రాజు, నరహరి రెడ్డి, ఉపాధ్యక్షులు మల్కయ్య, భద్రేశ్వర్, బీజేవైఎం అధ్యక్షులు రవి, కిషన్ మోర్చా అధ్యక్షులు సంటెం వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ నాయకుల వినూత్న కార్యక్రమం

■ దున్నపోతు ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం అందజేత!

■ రైతన్నలకు సకాలంలో ఎరువులు అందించాలి : బిఆర్ఎస్ నాయకులు



ఎరువుల కొరతపై దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**వనపర్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ బిజెపి దొంగాటలో రాష్ట్ర రైతాంగం నడ్డి విడుస్తున్నారని బిఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ పలుస రమేష్ గౌడ్ ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శించారు. మంగళవారం రైతులకు సకారంలో ఎరువులు అందించాలని దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు అందించలేకపోగా ఇచ్చామని ఒకడు ఇవ్వలేదని ఒకడు డ్రామా లులాడుతూ బ్లాక్ మార్కెట్లో ఎరువులు అమ్ముకుంటున్నారని వారు మండిపడ్డారు. ఎరువుల కొరతపై టిఆర్ఎస్ నాయకులు నిరసనలు చేస్తే పోలీసులు అరెస్టులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందనీ అధికారులు పోలీసులు అధికార పార్టీకి బానిసలుగా మారారని విమర్శించారు. న్యాయం అడుగుతే అరెస్టులు చేస్తున్నారని అందుకే దున్నపోతు ద్వారా ప్రభుత్వానికి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పరంజ్యోతి, మాజీ కౌన్సిలర్స్ నాగన్న యాదవ్, ఉంగ్లం తిరుమల్ ప్రేమ్ నాథ్ రెడ్డి కంచరవి ,స్టార్ రహీం, డేగ మహేశ్వర్ రెడ్డి, మాధవరెడ్డి, హేమంత్ ముదిరాజ్, అవిశెట్టి భాగ్యరాజ్, జోహెబ్ హుస్సేన్, ఇమ్రాన్, చిట్యాల రాము,ఆరిఫ్, గాడిదల మోహన్, బాల్‌రాజ్ , నందిమల్ల సుబ్బు, అలీమ్ అనుపటి రాము,సంతోష్, మునికుమార్, జెర్రీ,సాదిక్, వాటర్ మహబూబ్, ఖాదర్, లక్ష్మణ్ గౌడ్, వెంకటేష్, తోట శ్రీను, శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నారాయణ పేట,కొడంగల్ ఎత్తిపోతలకు ఆటంకం కలిగిస్తే శాశ్వత సమాధి కడతారు



మాట్లాడుతున్న జలసాధన సమితి సభ్యులు

**నారాయణ పేట, ఆగస్టు 26 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా రైతులకు సాగు, తాగునీరు అందించే మక్తల్, నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు ఆపాలని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల జారీ వెనుక కొంత మంది నాయకుల కుట్రలు ఉన్నాయని జల సాధన సమితి జిల్లా కో కన్వీనర్ హెచ్.నర్సింహ,బీ కేవస్ జోనల్ ఇంచార్జ్ వెంకోబ, నారాయణ పేట జిల్లా జాగృతి అధ్యక్షుడు గావినోళ్ల శ్రీనివాస్ అన్నారు. అమాయక రైతులను ముందు పెట్టి పర్యావరణ అనుమతులు లేవు. పనులు ఆపాలని కొన్ని దుష్ట శక్తులు కుట్రలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎత్తిపోతల వలన పర్యావరణానికి ఎలాంటి నష్టం లేదు అని తెలిపారు. జిల్లాలోని అఖిల పక్ష నాయకులు రైతులు వెంటనే ఈ ఎత్తిపోతల పథకం పూర్తి చేసి జిల్లా రైతులకు సాగునీరు ఇవ్వాలని అంటున్నారని తెలిపారు. జిల్లా రైతులకు క్షమాపణ చెప్పి ఈ ఎత్తిపోతల పథకం పూర్తి అవుటకు సహరిస్తేనే రాజకీయ భవిష్యత్ ఉంటుందని తెలిపారు. తెరవెనుక కుట్రలు చేసి పేట కొడంగల్ ఎత్తిపోతలకు ఆటంకం కలిగిస్తే జిల్లా రైతులు శాశ్వతంగా రాజకీయ సమాధి చేస్తారని తెలిపారు ప్రభుత్వం కూడా అన్ని రకాల అనుమతులు తీసుకొని యుద్ద ప్రాతిపదికన ఈ ఎత్తిపోతల పనులు పూర్తి చేసి జిల్లా రైతులకు సాగునీరు మరియు త్రాగునీరు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, గోపాల్ యాదవ్, సూర్యకాంత్, మైపాల్, బాలప్ప, లక్ష్మీకాంత్, మల్లికార్జున్, వెంకటప్ప, లక్ష్మీనారాయణ, అంజయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

**ఇటిక్యాల ఆగస్టు 26 ప్రభాతవార్త:** వినాయక చవితి పండుగను పురస్కరించుకొని బుధవారం గ్రామీణ ప్రాంతాలలో మండపాలలో పూజలకు గణనాథులు కొలువుదీరనున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులను మండల పరిధిలోని అలాగే ఇతర ప్రాంతాల నుండి 3 వ రోజు నుండి ప్రారంభమై 12వ రోజు వరకు కూడా గణనాథులను బీచుపల్లి కృష్ణా నదిలో నిమజ్జనం చేస్తారు. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం విద్యుత్ శాఖ ఇతర శాఖల అధికారులతో కలిసి నిమజ్జన ఏర్పాట్ల రూటును ఎస్సై కే.రవి పరిశీలించారు. నిమజ్జనం కోసం చేపట్టే ఏర్పాట్లు బారికేట్స్. విద్యుత్ సౌకర్యం. వాహనాలలో గణనాథులను కుక్కర్ ఘాటు వద్దకు తీసుకుపోయే రూటును పరిశీలిస్తూ నిమజ్జన ఏర్పాట్ల కొరకు సన్నద్ధం అవుతున్నారు.

## మొక్కలు పంపిణీ చేసిన కమిషనర్

**మద్దూర్, ఆగస్టు26 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూరు మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కోస్గి వ్యవసాయం మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముద్ది భీములు ఒకటవ రెండవ వార్డుల్లో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. వనమహోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటికి మొక్కలు నాటాలని కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. మట్టి వినాయకులు పంపిణీ మద్దూరు మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ మున్సిపల్ ప్రజలకు వినాయక చవితి సందర్భంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోస్గి వ్యవసాయం మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముద్ది భీములు మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల పండుగ సంబరాలు

**దేవరకద్ర, ఆగస్టు 26 ప్రభాతవార్త:** దేవరకద్ర మండల కేంద్రంలోని గుడిబండ గ్రామంలో మంగళవారం బోనాల పండుగ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ బోనాల పండుగ ఉత్సవాల సందర్భంగా వేడుకలు గ్రామంలోని మహిళలు, ప్రజలు, గ్రామస్తులు మొదటగా ప్రతి ఇంటింటి గడప గడప నుంచి బోనం కుండను అలంకారంతో పూజించుకొని గ్రామంలో ఒక దగ్గర చేరుకొని గ్రామ ప్రధాన పురవీధుల గుండా తిరుగుకుంటూ వచ్చి గ్రామ దేవతల ఆలయం దగ్గరికి చేరుకొని గ్రామ దేవతల చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు.అనంతరం గ్రామప్రజలు, గ్రామస్తులందరూ సల్లంగా దీవించమ్మ అంటూ మంగళ వాయిద్యాలతో డప్పు మేళలతో గ్రామంలోని ఊరేగుతూ ఘనంగా బోనాల ఉత్సవంతో పండుగ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గుడిబండ అమరేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గుడిబండ గ్రామ నాయకులు, మహిళలు, ప్రజలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి విగ్రహాలను ప్రతిష్టించి పర్యావరణాన్ని కాపాడాలి

జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



**వనపర్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త:** పర్యావరణ హితమై ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో కాకుండా మట్టి గణపయ్య విగ్రహాలను మాత్రమే నెలకొల్పాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్యా నాయక్ సూచించారు. ఆగస్టు 27న వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని మంగళవారం ఐడిఒసి సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో వినాయక మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య తో కలిసి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో అమ్ముతున్న వినాయక విగ్రహాలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్, పర్యావరణానికి హాని కలిగించే రంగులతో తయారు చేసి అమ్ముతున్నారని, వాటిని పూజ అనంతరం నీటిలో నిమజ్జనం చేయడంతో నీరు కాలుష్యమై పర్యావరణానికి హాని కలిగిస్తుందన్నారు. రంగులు పర్యావరణం,నీరు కాలుష్యం కావడమే కాకుండా చాలా రోజుల వరకు ప్లాస్టర్ ఆఫ్‌పారిస్ విగ్రహం నీటిలో త్వరగా కరిగిపో కుండా ఉంటుందనితెలిపారు. అందువల్ల మట్టి విగ్రహాలను మాత్రమే నెలకొల్పి పూజించడం వల్ల పర్యావరణాన్ని కాపాడినవారవుతారని తెలియజేశారు. బిసి సంక్షేమ శాఖ, కాలుష్య నియంత్రణ సంస్థ ద్వారావనపర్తి జిల్లా ప్రజలకు 2000మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ నిమిత్తం కాలుష్య నియంత్రణ మండలి ద్వారా రూపొందించిన ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, జిల్లా అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి ఎఈఎస్ సురేష్, ఎఇ భాను ప్రకాష్, బి.సి. సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ప్రభాకర్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు వ్యతిరేక ప్రభుత్వాల మెడలు వంచాలి

ఏఐయుకేఎస్ రాష్ట్ర ప్రథమ సభలో నాయకులు



అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకెఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభ నిర్వహిస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు26 ప్రభాతవార్త:** రైతు ఉద్యమాలు బలోపేతం కావాలి, రైతు సంక్షేమం పట్టని ప్రభుత్వాలా మెడలు వంచాలి. అప్పుడే రైతు బాగుపడుతాడు.నిజమైన రాజుగా మారుతాడు అని హై కోర్టు రిటైడ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ రైతులకు పిలుపునిచ్చారు. అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకెఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభ మంగళవారం స్థానిక సుదర్శన్ పంక్షన్ హాల్ నందు రెండవ రోజు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రతినిధుల సభకు ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు.దేశంలో రాష్ట్రంలో రాజకీయాలు దిగజారిపోయాయి.వాస్తవానికి రాజకీయాలు ప్రజల చుట్టు తిరగాలి నాయకులు ప్రజల గూర్చి, రైతులగూర్చి చర్చలు జరపాలి. కాని అలా జరగడం లేదు మొత్తం హిందూ ముస్లిం మతాల చుట్టు,ఆవు చుట్టు డబ్బు చుట్టు తిరుగుతున్నాయి. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, దొరకడం లేదు యూరియాకు లైన్‌లో నిలబడి తమ ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ చర్చలు ఎవరు ఎక్కడ చేయరు. కాని ఈ రోజు చూస్తే అత్యంత కఠినమైన వాస్తవం ఏంటంటే ఆవు మాంసం ఎగుమతి చేస్తున్న కంపెనీలు తొంభై తొమ్మిది శాతం హిందువులవే గుజరాతి, మార్వాడిలవే ఉన్నాయి. భారత్‌లో లెక్కలు చూస్తే ఆకలి సూచిలో పెరిగిపోయింది,హింస పెరిగిపోయింది, ఆత్మహత్యలు పెరిగిపోయాయి. నాణ్యమైన విద్యా అందడం లేదు. అణిచి వేత, అవినీతి పెరిగింది. దీన్ని చర్చించడం లేదు అన్నారు. మొన్న ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షాలు జస్టిస్ సుదర్శన్ రెడ్డిని పోటీలో నిలిపితే ఆయన మీద అమిత్ షా నక్సలైట్ సానుభూతి పరుడని, సల్వాజుడుంను నిషేదించడని ఆరోపణలు చేటున్నాడు అంటే తీర్పులు ఇచ్చేటప్పుడు ఎవరు ఏ పార్టీ అని చూసి తీర్పులు ఇవ్వాళా అని ప్రశ్నించారు. తీర్పులు రాజ్యాంగానికి లోబడి ఉన్నాయా లేదా అని చూడాలి కాని నాకు అనుకూలంగా అని చూడరాదు ఇది రాజ్యాంగం,కోర్టులపై అవగాహన లేని వ్యక్తుల మాటలు అన్నారు. ఇదంతా ప్రజలు గమనించాలి అన్నారు. ఈ మధ్యన ప్రాజెక్టు ల పేరుతొ రైతులనుండి వేలఎకరాలభూములు సేకరిస్తున్నారు. కాని వారికి మార్కెట్ విలువకు తగ్గట్టు పరిహారం ఇవ్వకుండా అరకొర పరిహారం ఇచ్చి రైతులను రోడ్డున పడేస్తున్నారు అన్నారు. యూరియా ఎందుకు ఇవ్వరు అని ప్రశ్నించారు ప్రస్తు త రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతు రాజ్యం కై కొట్లాడాలి అన్నారు. ఈ సభలో పంజాబ్, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక, ఒడిస్సా, పశ్చిమ బెంగాల్ రైతు నాయకులు సందేశాలు ఇచ్చారు. రైతు సభలకు మద్దతుగా పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ ఎం. రాఘవచారి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. కృష్ణ, టియుసిఐ రాష్ట్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎల్. పద్మ, పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, పి ఓ డబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయ,పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి సీతారాం, మాట్లాడారు.రైతు సంఘం నాయకులు వి.ప్రభాకర్, ఉపాధ్యక్షులు గుమ్మడి నర్సయ్య, చిన్నచంద్రన్న, బి.రాము. సిఎచ్ రాంచందర్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా రైతు నాయకులు బి.యాదగిరి, కొండారెడ్డి, రాజన్న, భగవంతు పాల్గొన్నారు.

## మహిళలు ర్యాంప్ ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగ రావు

**గద్వాలటౌన్ ఆగస్టు26, ప్రభాతవార్త:** మహిళలు ర్యాంప్ ప్రోగ్రాం ద్వారా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అన్నారు. మంగళవారం ఐడీఓసీ సమావేశం హాల్‌నందు వీహబ్ ఆధ్వర్యంలో మహిళా పరిశ్రామిక వేత్తలకు "ర్యాంప్ వుమెన్ అక్సెలేరేషన్ ప్రోగ్రాం"పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు వ్యాపార రంగంలో ముందుకు రావడానికి వి హబ్ ఒక బలమైన వేదికగా పనిచేస్తోందని అన్నారు. ర్యాంప్ కార్యక్రమం ద్వారా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నసబ్సిడీలు,రుణాలు, శిక్షణా సదుపాయాలు,మెంటార్షిప్ అవకాశాలపై మహిళలకు అవగాహన కల్పించబడుతోందని తెలిపారు. ఈ బూట్‌క్యాంప్ ద్వారా ప్రోగ్రాం పై అవగాహన కల్పించి, మహిళా పరిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు స్వీకరించబడ్డాయని తెలిపారు.టెక్స్టైల్స్,ఫుడ్ ప్రాసెసింగ్,మాన్యుఫాక్చరింగ్, హస్తకళల వంటి రంగాల్లో వ్యాపారులకి బిజినెస్ నైపుణ్యాల శిక్షణ,ప్రొడక్ట్ డెవలప్మెంట్, డైవర్సిఫికేషన్, బ్రాండింగ్ మార్కెట్ యాక్సెస్, క్రెడిట్ లింకేజ్,ఎక్స్పర్ట్ మెంటరింగ్ మద్దతులు అందించబడతాయని తెలిపారు.రెండు సంవత్సరాల పాటు కొనసాగనున్న ఈ ప్రోగ్రాం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన మహిళా పరిశ్రామికవేత్తలకు తమ వ్యాపార అభివృద్ధిని వేగవంతం చేసి ఆదాయాన్ని పెంచుకునే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీ హబ్ సోషల్ ఇంపాక్ట్ ఎంట్రప్రెన్యూషిప్ డైరెక్టర్ జాహిద్ షేక్,వీ హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఊహ,ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సాయి రామ్, జీ.ఎం.ఇండస్ట్రీస్ రామలింగేశ్వర్, అడిషనల్ డిఆర్డిఓ శ్రీనివాస్,డిపిఎం అరుణమ్మ, మెప్మ డిఎంసి వెంకటేశ్వర్లు, తదితరులు, పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరు

● భూ నిర్వాసితుల సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి



**దామరగిద్ద, ఆగస్టు 26 ప్రభాతవార్త:** మక్తల్ నారాయణ పేట్, కొడంగల్ భూ నిర్వాసితులను ఆదుకోవాలి 8/8/2025 రోజు కానుకుర్తి గ్రామం నుండి దామరగిద్ద వరకు జరిగిన పాదయాత్రను పోలీస్‌లు గడిమున్కనిపల్లి గ్రామం దగ్గర అడ్డుకున్నారు.ఈ సందర్భంగా పోలీస్‌లకు రైతులకు వాగ్వాదం జరిగింది. నాయకులను దామరగిద్ద పోలీసులు అరెస్ట్ చేసి, కేసు లు చేయడం జరిగింది. మంగళవారం అరెస్ట్ చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి విడుదల చేశారు.ఈ సందర్భంగా భూనిర్వాసిత సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని అడిగితే కేసులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 16 మందిరైతులు,నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేసారు.కేసులో జివెంకట్రామారెడ్డి,గోపాల్, మచేందర్, ధర్మరాజు, అంజిలయ్య, భీంరెడ్డి,ఆర్ వెంకట్రాములు, మహేష కుమార్,రామకృష్ణ,జోషి,అరుణ్,నర్సి రెడ్డి, మొగులప్ప,నారాయణ,మోహన్,వెంకటేశ్‌లపై కేసు అయినట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు

ఏఎస్ఐ ఆంజనేయులు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

**నారాయణ పేట, ఆగస్టు 26 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఉత్తర్వుల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు ఏఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనదారులకు జరిమానాలు విధించగా, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 06 కేసులు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించడం వల్ల ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలుగుతుందని, లివర్ సమస్యలు,గుండె జబ్బులు,మెదడు పనితీరు మందగించడం వంటి సమస్యలు వస్తాయని చెప్పారు. మద్యం సేవించివాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగి ప్రాణ నష్టం,ఆర్థిక నష్టం,కుటుంబ కలహాలు తలెత్తుతాయని తెలిపారు.యువత మద్యం అలవాటువల్ల చదువు, ఉద్యోగం, జీవితలక్ష్యాలు దెబ్బతింటాయని హెచ్చరించారు తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలని,కుటుంబం ఆనందంగా, సమాజం శాంతిగా ఉండాలంటే మద్యానికి పూర్తిగా దూరంగా ఉండండి అని ఎస్ఐ పిలుపునిచ్చారు.

## లోకుర్తిలో ఇంటి గ్రేటెడ్ హెల్త్ క్యాంప్

**దామరగిద్ద, ఆగస్టు 26 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం పరిధిలోని లోకుర్తి గ్రామంలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది. క్యాంపులోమొత్తం 227 మందిప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేయడం జరిగింది. ఇందులో 117 మందికి ప్రత్యేకంగా ఎక్స్రే ద్వారా పరీక్షించడం జరిగింది.ఐదు రకములపరీక్షలు అనగా హిమోగ్లోబిన్ హెచ్బీఎస్ ఏజీ,బీపీ ఆర్బిఎస్ లాంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పీహెచ్ దామరగిద్ద మెడికల్ ఆఫీసర్ డా స్రవంతి, డా. అమీర్ సోహెల్,డా. అంబిక , పీహెచ్ సీదామరగిద్ద సిబ్బంది పి.నారాయణ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్, కృష్ణవేణి ఎస్ టిఎస్, ఏఎన్ఎం బాలచంద్రమ్మ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



వినాయకుని ఆకారంలో ప్రదర్శించిన ఎర్రవల్లి సరస్వతి టెక్నో పాఠశాల విద్యార్థులు

## వినాయకుని ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

**ఇటిక్యాల ఆగస్టు26, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో గల సరస్వతి టెక్నో పాఠశాల కు చెందిన విద్యార్థులు వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మంగళవారం పాఠశాల విద్యార్థులు బొజ్జ గణపయ్య ఆకారంలో వినూత్నంగా ప్రదర్శించారు. పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థు లు కొత్త ఆలోచనలతో వినాయకుని ఆకారంలో విద్యార్థులు కూర్చొని అబ్బురపరిచారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల చైర్మన్ గోవర్ధన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ భారతీయులు అతి ముఖ్యమైన పండుగలలో వినాయక చవితి పండుగ అని పార్వతి పరమేశ్వరుల కుమారుడైన వినాయకుని పుట్టినరోజునే వినాయక చవితిభక్తిశ్రద్ధలతో కుల మతాలకు అతీతంగా జరుపుకుంటారన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన తీరును పాఠశాల చైర్మన్ ఆనందం వ్యక్తం చేసి విద్యార్థులందరినీ అభినందించారు అదేవిధంగా చిన్నారులు మట్టి వినాయకుని చేసి పర్యావరణాన్ని కాపాడుతూ పరిరక్షించుకోవాలని సమాజంలో అందరం బాగుండాలనే ఉద్దేశంతో చిన్నారులు చేసిన చిన్నచిన్న గణనాథులు ఆకట్టుకున్నాయి. వీరికి సహకరించిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందిస్తూ ముందస్తుగా ప్రజలకు పాఠశాల చైర్మన్ గోవర్ధన్ రెడ్డి వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్‌గోవర్ధన్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ మధులిక రెడ్డి, ప్రిన్సిపాల్ నందిని కేని, వైస్ ప్రిన్సిపాల్ మహిమ, ఉపాధ్యాయులు సువర్ణ,రేణుక, రుక్సానా,వ్యాయామఉపాధ్యాయులు ప్రియాంక,లాలు, నరేంద్ర మరియు విద్యార్థులు పాల్గొన్నారు..

## మట్టి వినాయకుల పంపిణీ



**నారాయణపేట, ఆగస్టు 26 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణం లోని స్థానిక శక్తిపీఠం శ్రీసంత్ మఠ మూల మహాసం స్థానం ఆధ్వర్యంలో ఉచిత మట్టివినాయకుల వితరణ కార్యక్ర మం ఘనంగా నిర్వహించబడింది. ప్రథమంగా శక్తిపీఠం వ్యవ స్థాపకులు పూజ్య శ్రీ డా.స్వామి శాంతానంద పురోహిత్ వినా యకునికి తొలిపూజ నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు మట్టి వినాయకులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా స్వామి శాంతానంద పురోహిత్ భక్తులను ఉద్దేశించి మట్టి వినాయకులను ప్రతిష్టిద్దాం ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడుదాం అనిసందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శక్తి పీఠం ట్రస్ట్ సభ్యులు దోమ సుధాకర్, నంది రాజశేఖర్, నిత్యాన్నదాన సత్రం ప్రముఖ్ బుసమోళ్ల నర్సిరెడ్డి, అలాగే శక్తి పీఠం సభ్యులు, ఉద్యోగులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

■ నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట, ఆగస్టు 26 ప్రభాతవార్త:** జిల్లా ప్రజలందరికీ గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హార్దిక శుభాకాంక్షలు తెలుపుతూ, ఉత్సవాలను శాంతియుతంగా, ఆనందోత్సాహలతో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మంటప నిర్వాహకులు తప్ప నిసరిగా పాటించవలసిన సూచనలు గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన సమయంలో కరెంట్ వైర్ల నుండి జాగ్రత్తలు పాటించాలి. శోభా యాత్రలు,నిమజ్జనం కోసం ముందుగానే పోలీసుల అనుమతి తీసుకోవాలి ట్రాఫిక్‌కు ఆటంకంకలగకుండా మంటపాలను ఏర్పాటు చేసి, సంబంధిత స్థల యజమాని అనుమతి తప్పనిసరిగా తీసుకో వాలి విద్యుత్ కనెక్షన్లు సురక్షితంగా ఉండేలా చూసుకోవాలి. ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తప్పనిసరి సౌండ్ సిస్టమ్స్ ప్రభుత్వం నిర్ణయించిన పరిమితిలో ఉండాలి. డీజే లకు అనుమతి లేదు. రాత్రి 10గం.ల తర్వాత లౌడ్ స్పీకర్లు పూర్తిగా నిషేధం. మహిళల భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, పోలీసులతో సమన్వయం కలిగి ఉండాలి నిమజ్జనం మార్గాన్ని ముందుగానే పోలీసులకు తెలియ జేసి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాల పార్కింగ్ సదుపాయం కల్పించాలి.ఉత్సవాల సమయంలో అన్నిమతాల వారితోసఖ్యతగా, శాంతి భద్రతలతో కార్యక్రమాలు నిర్వహించాలి పర్యావరణానికి హాని కలిగించని మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలి. ప్రతి గణేష్ మండపం వద్ద తప్పనిసరిగా పాయింట్‌పుస్తకం ఉంచాలిపోలీస్ అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో రాసి సంతకం చేస్తారు.అనుమానాస్పద వస్తువులు, బ్యాగులు లేదా సంచులు కనబడితే వాటిని తాకకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి ఉత్సవాల సందర్భంగా సోషల్ మీడియాలో వచ్చే అసత్యవార్తలు, రూమర్లను నమ్మకూడదు. ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలి జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారుఉత్సవాలను శాంతియుతంగా, ఆనందంగా జరుపుకొని నారాయణపేట జిల్లానుశాంతి, సామరస్యాలకు ఆదర్శంగా నిలబెడదాంప్రతి ఒక్కరు పోలీస్ శాఖకు సహకరించాలని కోరుతున్నానని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత

ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి



మట్టి వినాయకులను అందజేస్తున్న ఎమ్మెల్యే

**నారాయణ పేట, ఆగస్టు 26 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణ కేంద్రంలో మంగళవారం స్థానిక చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి అన్నారు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను తయారుచేసి పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పర్యావరణ పరిరక్షణకు కృషి చేసే కార్యక్రమాలు ప్రజలలో విస్తృతపరిచి వారిలో అవగాహన తీసుకురావాలని సూచించారు వాలంటీర్లు మట్టితో తయారు చేసిన మట్టి విగ్రహాన్ని ఎమ్మెల్యేకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.మెర్సీ వసంత ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు జి, శ్రీనివాస్, డా.సెఫిక్ అహ్మద్, సంగీత నిర్మల, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లకు కమిషన్ ఇవ్వాలి

**వీపనగండ్ల ఆగస్టు 26,ప్రభాతవార్త:** ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న రేషన్ డీలర్ల కమిషన్ మొత్తాలను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ మండల రేషన్ డీలర్ల రెవెన్యూ కార్యాలయం దగ్గర మంగళవారం నాడు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం తరపున సంఘ అధ్యక్షుడు బస్వరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో తాసి ల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదు నెలలుగా కమిషన్ డబ్బులు రాక పోవడంతో రేషన్ డీలర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అని అన్నారు అదేవిధంగా ప్రభుత్వం డీలర్లకు నెలకు కనీసం 30 వేల రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని,రేషన్ దుకాణాలలో బియ్యం దించే హమాలీల ఖర్చులను ప్రభుత్వం భరించాలని,అదేవిధంగా ప్రతి డీలర్‌కు రూ.10 లక్షల బీమా వర్తింపజేయాలని అని డిమాండ్ చేశారు. రేషన్ డీలర్లు సుధాకర్ రెడ్డి, దశరథం గౌడ్, వెంకటయ్య గౌడ్, కృష్ణారెడ్డి, రాజారెడ్డి, ఒరే రాజేష్, యుగంధర్, నారాయణ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

**బిజినేపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ నాయకులు మంగళవారం తహసిల్దార్‌కు వినతిపత్రం అందించారు. మండల ఇంచార్జ్ బుసరెడ్డిసుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు సకాలంలో యూరియా, డిఏపి అందించి రైతుల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కేంద్రాల వద్ద కృత్రిమ కొరత సృష్టించి అక్రమంగా ఎరువులను పక్క దారి పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతాంగంతో కొనుగోలు చేసిన సన్న వడ్లకు మద్దతు ధర 500 బోనసు రైతుల ఖాతాలలో జమ చేయా లన్నారు. ఇందిరమ్మ ఇండ్లను కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకు వారి అనుచరులకే ఇవ్వడం సరికాదని, నిరూ పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తూ, పూర్తి అయిన వారి ఖాతాలలో డబ్బు లు వెంటనే జమ చేయాలన్నారు. పెంచిన పింఛన్లను ఇవ్వాలని, కురిసిన వర్షాలకు పాడైపోయిన రోడ్లకు వంద ల మ్మ తు లు చేపట్టాలని కోరుతూ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్ కార్యాలయంలో అందించారు. మండల అధ్యక్షులు పిట్టల శ్రీరాములు సీనియర్ నాయకులు గుమ్మ కొండ బుషయ్య జాకీర్ హుస్సేన్ నారాయణ చారి, ఊరుకొండ రఘు బాబు, శ్రీకాంత్ శర్మ, లక్ష్మణ్, కృష్ణ, జె.రాము, ఆంజనేయులు, మాకం చంద్రకళ, రంజిత్, నామ ఓం ప్రకాష్, సాయిబాబు, శివ, భూపతి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL SENIOR CIVIL JUDGE: MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT MALKAJGIRI
I.A No. 705 OF 2025
IN
O.S. No. 1571 OF 2022
Between:
Ramidi Ram Reddy
...Petitioner/Plaintiff
AND
Smt. C. Nirmala Devi and others
...Respondents/Defendants
26. Sri. Kasireddy Prabhakar Reddy, S/o. K. Balreddy, Aged about:53 yrs, Occ: Employee, R/o.1-30, Venkateshwarla Bhavi, Amarabad Mandal, Mahbubnagar District-509201.
Please take notice in the above suit that the plaintiff herein has filed the above suit for declaration of title and to declare the defendants' sale deed documents as null and void against defendants before this Hon'ble Court.
Therefore, you the above defendant hereby informed that if you have got any objection or interest should appear and file the same before the above said Hon'ble Court on 07/10/2025 at 10.30 A.M through counsel or in person failing which the matter will decided on merits.
(BY ORDER OF THE COURT)
KOTA RAMCHANDRA REDDY
Advocate
M/S. KOTA LAW ASSOCIATES
H. No. 40-254/1/1, Raghavendra Nagar, Moula Ali, Hyderabad -40.
Cell No. 98493 25055.

